నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 22 ఏప్రిల్ 2025 | HYDERABAD

బియ్యం సేకరిస్తున్న కార్మికులు

కార్మికుల భిక్షాటన

మేడ్చల్, ఏప్రిల్ 21 : వేతనాల కోసం పక్షం రోజులుగా ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సోమవారం మేడ్చల్ మండలం నూతన్‌కల్‌లో పంచాయతీ కార్యాలయం ఎదుట వంటావార్పు నిర్వహించారు. గ్రామంలో భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. కార్మికులు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు లేకపోవడంతో తాము పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజారోగ్యం పని చేస్తున్న తమకు ప్రభుత్వం అన్యాయం చేయడం తగదన్నారు.

వాల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, సీనియర్ నేత సంపత్ మాధవరెడ్డి

కదనోత్సాహంతో కదులుదాం

దేశ రాజకీయాల్లో సభ చరిత్ర సృష్టించనున్నది

- నియోజకవర్గం నుంచి 4 వేల మందితో కదులుతాం
- కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎన్నో అద్భుతాలు
- కాంగ్రెస్ పాలన మాకొద్దంటున్న ప్రజలు
- రేవంత్ సర్కార్‌పై దుమ్మెత్తి పోస్తున్న జనం
- 'నమస్తే'తో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): ఉద్యమ పార్టీగా పురుడు పోసుకున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గ్రేటర్ గులాబీ శ్రేణులు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ 25 ఏండ్ల ప్రస్థానం నేపథ్యంలో చరిత్రలో గుర్తుండి పోయేలా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కనీవినీ ఎరుగని రీతిలో బహిరంగ సభను వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహిస్తున్నారు. స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర సమితి రెండున్నర దశాబ్దాల కాలంలో అనేక అద్భుత ఘట్టాలకు సాక్షాత్కారమై నిలిచింది. ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన బీఆర్ఎస్ దేశంలోనే ఒక ప్రత్యేకతను సాధించింది. తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక ఎజెండాతో పురుడు పోసుకున్న టీఆర్ఎస్ నేడు బీఆర్ఎస్‌గా ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. చారిత్రాత్మకమైన రజతోత్సవ సభలో పాలుపంచుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉత్సాహాన్ని కనబరుస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పాలన తీరుపై విసుగెత్తిపోతున్న ప్రజలు, బీఆర్ఎస్ అభిమానులు కేసీఆర్ సభకు హాజరు కావడానికి ఆసక్తి చూపిస్తున్నారు. గ్రేటర్‌లో బలంగా ఉన్న బీఆర్ఎస్ ఎల్కతుర్తి సభకు ఎలా ప్లాన్ చేశారు.. సన్నాహక సభల రెస్పాన్స్ ఎలా ఉంది.. 14 ఏండ్ల ఉద్యమం, 10 ఏండ్ల కేసీఆర్ పాలనలో సాధించిన విజయాలు.. 16 నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజలు ఏమంటున్నారు.. సభ రోజున ఎంత మంది వెళ్తున్నారు.. అన్న అంశాలపై మాజీ మంత్రి, సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు.

చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామలహేమ, బీఆర్ఎస్ శ్రేణులు

చరిత్రను చెరపలేరు..

స్వయం పాలన, తమ రాష్ట్రం మాకు కావాలె అన్న ఏకైక నినాదంతో ఒక్కడితో కేసీఆర్ గులాబీ జెండా ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2001లో జలదృశ్యం వేదికగా ప్రారంభమైన కేసీఆర్ నాయకత్వం సబ్బండ వర్గాలను తెలంగాణ ఉద్యమం వైపు మళ్లించారు. రాష్ట్ర ఏర్పాటు (మిగతా IVవ పేజీలో)

రజతోత్సవ సభకు తరలిరండి

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 21 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను సోమవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, ఉద్యమకారుడు సంపత్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులు, మాజీ ప్రజా ప్రతినిధులు కలిసి విడుదల చేశారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ అడుగడుగునా వివక్షకు గురైన తెలంగాణ ప్రాంతాన్ని స్వరాష్ట్ర సాధనతో బంగారు మయంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు భారీగా తరలివెళ్లేలా అందరు సమన్వయంతో పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డివిజన్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, గుమ్మడి మధుసూదన్ రాజు, నరేందర్ రెడ్డి, ఎల్లా గౌడ్, అనిల్, పులి మహేశ్, నిజాంపేట్ కార్పొరేషన్ సీనియర్ నాయకులు, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, సీనియర్ నాయకులు మురళీ యాదవ్, రవి కాంత్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవరన్నా.. చలో వరంగల్

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలాలని రాష్ట్ర ఆటో యూనియన్ నాయకులు సమయాత్తమవుతున్నారు. కేసీఆర్ పాలన మళ్లీ రావాలంటూ నాచారంలో సోమవారం ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ తీశారు. 'కేసీఆర్ పాలన కావాలి.. కాంగ్రెస్ పాలన పోవాలి' అంటూ డ్రైవర్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడుతూ.. చావడమే మీకు దిక్కు అనేలా రాక్షస పాలన చేస్తున్న ప్రభుత్వం ఒక్క రేవంత్ ప్రభుత్వమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో ఆత్మహత్యలు చేసుకున్న ఒక్క ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆటో జేఏసీ నాయకులు శాతం రమేశ్ మాట్లాడుతూ.. బూటకపు హామీలిచ్చి డ్రైవర్లను అన్ని విధాలుగా రేవంత్ సర్కార్ మోసంచేసిందని అన్నారు. కార్యక్రమంలో ఆటో జేఏసీ నాయకులు హయ్యద్ బాయ్, వెంకటేశ్, రమేశ్, కుమార్, అజార్, గోపాల్, ఎల్లయ్య, శ్రీనివాస్, రామాజంనేయులు, సాయికుమార్ పాల్గొన్నారు.

సభకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సభ చరిత్రలో నిలిచిపోతుంది

బేగంపేట్ ఏప్రిల్ 21 : ఈ నెల 27న నిర్వహించే బీఆర్ ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతదని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి బస్తీ, ప్రతి కాలనీ నుంచి పెద్ద సంఖ్యలో సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. స్వరాష్ట్ర సాధన తోనే న్యాయం జరుగుతుందని గుర్తించిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ నాయకత్వం లో బీఆర్ఎస్ పుట్టిందన్నారు.రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ కేసీఆర్ శ్రీ రామ రక్ష అన్నారు. పార్టీ పుట్టి 25 వసంతాలు పూర్తవుతున్న నేపథ్యంలో 27న అన్ని డివిజన్ లలో పార్టీ జెండాలను ఎగురవేసి ఘనంగా నిర్వహించాలని సూచించారు. బేగంపేట అమీర్ పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, కొలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, పద్మారావు నగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, నాయకులు అత్తిలి మల్లికార్జున్ గౌడ్, తలసాని స్కైలాబ్ యాదవ్, నాయకులు నాగులు, కిశోర్, నరేందర్, అశోక్ యాదవ్, ఏసూరి మహేశ్, లక్ష్మీపతి, కరుణాకర్ రెడ్డి, ఖలీల్, సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

టాబ్లెట్లకు గ్లూకోజ్ కలిపి..

- మత్తు కోసం డోస్ పెంచి.. ఇంజక్షన్లుగా మారుస్తున్న మురా
- గంజాయి, డ్రగ్స్‌తో పాటు సిటీలోకి 'పెయిన్ కిల్లర్' ట్రెండ్
- ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువత
- నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న మందుల విక్రయాలు..!
- తనిఖీలు పక్కన పెట్టి.. నిద్రావస్థలో యంత్రాంగం
- బాలాపూర్ ఘటనతో ఉలిక్కిపడిన నగరం

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): యువతను చిత్తు చేసి వారి ప్రాణాలను హరించి వేసే సరికొత్త మత్తు ట్రెండ్ నగరంలోకి ప్రవేశించింది. గంజాయి, డ్రగ్స్ ల విచ్చలవిడి అక్రమ సరఫరాతో సతమవుతున్న భాగ్యనగరాన్ని.. ఎవరూ ఊహించని ఓ భయంకరమైన మత్తు పదార్థం తీవ్రంగా కలవరపెడుతున్నది. పెయిన్ కిల్లర్లను కొనుగోలు చేసి వాటికి గ్లూకోజ్ కలిపి ఇంజక్షన్లుగా మార్చి యువతను ప్రాణాపాయంలోకి నెట్టివేస్తున్న విష సంస్కృతి నగరాన్ని ఆవహించింది. ఓ వైపు నిబంధనలకు విరుద్ధంగా ఫార్మసీ దుకాణాల్లో సాగుతున్న విక్రయాలు ఇందుకు ఓ కారణమైతే ఇంత జరుగుతున్నా కనీస నిఘా కొరవడిన ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యం అన్నింటికన్నా మరో ప్రధాన కారణమైంది.

మత్తు కోసం డోస్ పెంచి..

పోలీసులు, ఎక్సైజ్, తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఇలా ఆయా విభాగాల కండ్లు గప్పి యథేచ్ఛగా శివారులలో అక్రమ మందుల దందాను సాగిస్తున్నారు. గంజాయి, ఇతర డ్రగ్స్‌పై నిఘా పెరగడంతో మెడికల్ దుకాణాలలో దొరికే మందులనే కొందరు యువకులు మత్తుగా వాడేస్తున్నారు. దీనిని అసాంఘిక శక్తులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. ఈ విష సంస్కృతి కారణంగా బాలాపూర్‌లో 17 ఏండ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు యువకులు దవాఖానలో విషమ పరిస్థితుల్లో ఉన్నారు. బాలాపూర్‌లో శ్రీనివాస ఫార్మసీ దుకాణం నుంచి షాహిల్ అనే యువకుడు పెద్ద ఎత్తున పెయిన్ కిల్లర్లను కొనుగోలు చేసి స్థానికంగా ఉండే యువకులు, మైనర్లకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. మత్తు పదార్థాలు, పెయిన్ కిల్లర్లు, నిద్ర మాత్రలను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఫార్మసీ దుకాణాలు విక్రయించేందుకు వీలు లేదు. కాని కొన్ని సందర్భాలలో తెలిసిన వారు వస్తే ఒకటి రెండు మాత్రలకు మించి ఇవ్వడం లేదు. కాని ఏకంగా బల్క్‌లో ఇలాంటి మందులను సరఫరా చేస్తున్నా అటూ డ్రగ్ కంట్రోల్ విభాగం కాని ఇటూ పోలీసుల నిఘా కాని పట్టించుకోకపోవడం గమనార్హం. మెడికల్ దుకాణాలపై మొదట్లో తనిఖీల పేరిట హంగామా చేసిన డ్రగ్ కంట్రోల్ విభాగం ఆ తరువాత ఆ విషయాన్ని మర్చిపోయారు. కాగా పెయిన్ కిల్లర్లను అడ్డగోలుగా మార్కెట్లో విక్రయించడంతోనే యువకుల ప్రాణాలపైకి వచ్చిందంటూ స్థానికులు వాపోతున్నారు. టైడాల్ అనే పెయిన్ కిల్లర్ ట్యాబ్‌లెట్‌ను బాలాపూర్ ఘటనలో యువకులు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఈ ట్యాబ్‌లెట్లు వాళ్లకు ఎక్కడ దొరుకుతున్నాయని ఆరా తీయడంతో విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయి. ఈ పిల్లలకు సాహిల్ అనే యువకుడు ఈ మందులను సరఫరా చేస్తున్నాడని, అతనికి మెడికల్ దుకాణంలో నుంచి అమ్మకాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. మూడు నెలలుగా యువకులు ఈ ట్యాబ్‌లెట్లు తీసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు, అయితే ఈ ట్యాబ్‌లెట్లు పెయిన్ కిల్లర్ కావడంతో కొన్ని రోజులు వాడితే ఇది ఒక అలవాటుగా మారుతుందని వైద్యులు చెబుతున్నారు. అందుకే వైద్యులు సూచిస్తేనే ఈ ట్యాబ్‌లెట్లను ఇవ్వాలని వైద్యులు సూచనలు చేస్తున్నారు. ఈ టాబ్లెట్‌ను ద్రవంగా మార్చే ఆలోచన చేసిందెవరనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సాధారణంగా ఈ ట్యాబ్‌లెట్‌ను వాడడంతో నొప్పులకు ఉపశమనం ఉంటుంది. దాంతో పాటు ఒకటి రెండు టాబ్లెట్లు వాడడంతో కొద్దిగా మత్తుగా ఉంటుంది. అయితే యువకులకు మూడు నెలలుగా ఈ మాత్రను సరఫరా చేస్తుండడంతో రెండు మూడు (మిగతా IVవ పేజీలో)

గురువుకు అపూర్వ సన్మానం

ఎర్రగడ్డ, ఏప్రిల్ 21: సుమారు యాభై ఏండ్ల క్రితం ఖమ్మం జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న నలుగురు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారు. పదవీ విరమణ కూడా చేశారు. ప్రస్తుతం 64 ఏండ్ల వయసు వచ్చినప్పటికీ యాభై ఏండ్ల క్రితం తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువును వారు మర్చిపోలేదు. సోమవారం ఆ గురు శిష్యుల ఆత్మీయ కలయిక చోటు చేసుకుంది. గురువు పేరు కృష్ణశర్మ.. 87 ఏండ్ల వయసున్న శర్మ కుటుంబం ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్ నగర్ కాలనీలో ఉంటోంది. ఈయన శిష్యులైన ఎ.కృష్ణమోహన్, ఎం.కృష్ణయ్య, జి.సురేందర్ బాబు, రామరావు సోమవారం కృష్ణశర్మ నివాసానికి వెళ్లి తమ గురువును ఆప్యాయతగా పలకరించి ఘన సన్మానం చేశారు. కాగా.. శర్మ యాభై ఏండ్ల క్రితం ఖమ్మం జిల్లాలోని 6 ప్రభుత్వోన్నత పాఠశాలల్లో హెచ్ఎం గా పనిచేశారు. ఆ తర్వాత పదోన్నతి పొంది విద్యా శాఖలో అధికారిగా విధులు నిర్వహించారు. అనంతరం 1996లో పదవీ విరమణ చేశారు.

ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఉద్యోగ భద్రత

కల్పించండి

ఉస్మానియా యూనివర్సిటీ, బంజారాహిల్స్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలతో పాటు జేఎన్టీయూలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం మూడో రోజుకు చేరింది. ధర్నా శిబిరంలోకి పోలీసులు ప్రవేశించి నిరసనలకు, సమ్మెకు అనుమతి లేదంటూ కాంట్రాక్ట్ అధ్యాపకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించిన తర్వాతనే యూనివర్సిటీలలో అధ్యాపక నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్న అధ్యాపకులను విస్మరించి యూజీసీ పే స్కేల్ అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కాంట్రాక్టు అధ్యాపకుల అక్రమ నిర్బంధ అరెస్టులను నిరసిస్తూ బుధవారం 'చలో ఉస్మానియా' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అరెస్టు చేసిన కాంట్రాక్టు అధ్యాపకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపక సంఘం నాయకులు డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ పరశురాం, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ విజయందర్ రెడ్డి, డాక్టర్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్సిటీలో..

జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆందోళనకు దిగారు. యూనివర్సిటీ ప్రాంగణంలోని డా.అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డా.కే.అవినాశ్, ప్రధాన కార్యదర్శి డా.కిశోర్, డా.నర్సింహులు, డా.విజయ్, ఉమాదేవి పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్సిటీలో ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు

ఎలివేటెడ్

కారిడార్‌తో ముప్పు

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుపై స్థానికుల్లో తీవ్ర అసహనం వ్యక్తం అవుతుంది. ఓవైపు ప్రాజెక్టు వెడల్పు తగ్గించి, పరిహారం పెంచాలని ఇప్పటికే జేబీఎస్ శామీర్‌పేట్ మార్గంలో నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ప్రాజెక్టు వలన నివాస గృహాలు, మతపరమైన నిర్మాణాలకు నష్టం జరిగేలా ఉందని, ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్చాలంటూ ప్యారడైజ్ నుంచి సుచిత్ర మార్గంలో ఉండే నివాసితులు డిమాండ్ చేస్తున్నారు. ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను పునఃసమీక్షించి రీ సర్వే చేయాలని, అవసరమైతే అలైన్‌మెంట్ మార్చి ప్రాజెక్టు చేపట్టాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

అన్ని అభ్యంతరాలే..

ప్యారడైజ్ నుంచి మేడ్చల్ మార్గంలో, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ మార్గంలో మెరుగైన రవాణాకు ఆస్కారం ఉండేలా 16 కిలోమీటర్ల నిర్మించేందుకు హెచ్ఎండీఏ ప్లాన్ చేసింది. ప్రాజెక్టు మొత్తం కూడా నివాస ప్రాంతాల మీదుగా తీసుకెళ్లడం వలన స్థిరాస్తులే లేకుండా పోతున్నాయని ప్యారడైజ్ నుంచి సుచిత్ర మార్గంలోని స్థానికులు వాపోతున్నారు. ఇక జేబీఎస్ నుంచి వెళ్లే లైన్‌లో ఇప్పటికే ప్రాజెక్టు వెడల్పును 200 ఫీట్ల నుంచి 150ఫీట్లకు తగ్గిస్తేనే భూములు ఇస్తామని తేల్చి చెప్పడంతో ఇప్పటికీ భూసేకరణ పూర్తి కాలేదు. జనావాసాలపై కాకుండా నిర్మాణాలు తక్కువగా ఉన్న ప్రాంతాలు కూడా ఈ మార్గంలో ఉన్నాయని, ఆ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే తక్కువ ఆస్తి నష్టంతో ప్రాజెక్టు సులభంగా ముందుకు సాగుతుందని చెబుతున్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం!

● జూబ్లీహిల్స్ నవనిర్మాణ్ నగర్‌లో ఖాళీ స్థలంలో గేటు ఏర్పాటు

బంజారాహిల్స్,ఏప్రిల్ 21: జూబ్లీహిల్స్‌లోని నవనిర్మాణ నగర్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. ఆ స్థలానికి గేటు ఏర్పాటు చేయడంతో పాటు లోనికి ఎవ్వరి వెళ్లకుండా కాపలా ఉంచారు. షేక్‌పేట మండల పరిధిలోని సర్వే నెంబర్ 403లోకి వచ్చే జూబ్లీహిల్స్ రోడ్ నెం 1 ప్రధాన రహదారిలోని డీఈ షా సంస్థ భవనం వెనకాల సుమారు 300 గజాల ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలానికి ఒకవైపు జూబ్లీహిల్స్ సొసైటీకి చెందిన స్థలంలో ఏర్పాటైన భారతీయ విద్యాభవన్ స్కూల్ ఉండగా మరోవైపున నవనిర్మాణనగర్ కాలనీ ఉంటుంది. అయితే ఈ స్థలంలోకి వెళ్లడానికి నవ నిర్మాణనగర్‌లోనుంచి మాత్రమే రోడ్డు ఉంది. నవ నిర్మాణ్‌నగర్‌లోని జీహెచ్ఎంసీ ట్రీపార్కును ఆనుకుని ఉన్న ఈ స్థలం గురించి అక్కడి వారికి తప్ప బయటి వారికి తెలియదు. కాగా కొంతమంది పేదలు సుమారు మూడేళ్లుగా ఆ ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారు. ఇటీవల కాలనీకి చెందిన కొంతమంది పెద్దలు వారిని ఖాళీ చేయించి ఈ స్థలం కాలనీకి చెందినదని దబాయించారు. దీంతో వారంతా అక్కడి నుంచి రెవెన్యూ ఆఫీస్‌కు వెళ్లగా సంబంధిత స్థలం ప్రభుత్వానిదే అని తేలింది. వారంరోజుల నుంచి స్థలాన్ని కాపాడుతున్నామనే ప్రచారంతో కాలనీకి చెందిన కొంతమంది గేటు ఏర్పాటు చేశారు. లోనికి ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆ స్థలాన్ని క్రీడా మైదానంగా మార్చుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నవ నిర్మాణ్‌నగర్ సొసైటీకి సంబంధం లేని ఈ ప్రభుత్వ స్థలాన్ని కాలనీవాసులు ఎలా కలుపుకుంటారని కొంతమంది ప్రశ్నిస్తున్నారు. ఈ స్థలంలో రెవెన్యూశాఖ అధికారులు వెంటనే ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కాలనీలో గ్రీన్ బెల్ట్, ఓపెన్ స్థలాలుగా లే అవుట్‌లో చూపించి కొన్ని స్థలాలను ప్లాట్లుగా మార్చుకుని అమ్ముకున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఖాళీ స్థలంలోకి వెళ్లకుండా గేటు ఏర్పాటు చేసిన కాలనీవాసులు

నిబంధనలకు నీళ్లు

అర్బన్ బయోడైవర్సిటీలో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం

కమిషనర్‌ను తప్పుదోవ పట్టించిన యూబీడీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో నిబంధనలకు తిలోదకాలిస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు. అర్బన్ బయోడైవర్సిటీ విభాగంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సూపర్‌వైజర్స్) 39 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు (సూపర్‌వైజర్స్) 18 మంది కలిపి మొత్తం 57 మంది భర్తీకి టెండర్ పిలిచారు. ఒక్కొక్కరి నెలవారి వేతనం రూ.18,413లు ఉండగా నెలకు అలవెన్స్ రూ.1000 అదనంగా ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్టాండింగ్ కమిటీలో ఈ అంశాన్ని పెట్టి ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం జరిగింది..కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏ ఉద్యోగి నియామకం జరపాలన్న ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేసింది.కానీ ఘనత వహించిన అర్బన్ బయో డైవర్సిటీ విభాగం మాత్రం ఇవేమి పట్టలేదు.. జీహెచ్ఎంసీకి సంబంధించిన ఏ విషయమైన స్టాండింగ్ కమిటీలో ఎజెండా అంశంగా పెట్టి చర్చించిన అనంతరం కమిషనర్‌కు ఆ తర్వాత అక్కడి నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదన వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఈ 57 మంది నియామకంలో కమిషనర్‌కే నేరుగా ఫైల్ పెట్టి ఆమోదం తీసుకున్న అర్బన్ బయోడైవర్సిటీ విభాగం వ్యవహారం ఉద్యోగుల్లో చర్చకు దారి తీసింది. టెండర్ పద్ధతిలోనే నియామకం జరిపిన ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో కమిషనర్‌ను తప్పుదోవ పట్టించారన్న వాదనలు లేకపోలేదు. ప్రతి ఏటా తరహాలోనే ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం జరిగిందని బయో డైవర్సిటీ విభాగం చెబుతున్నది. ఈ విషయంలో అసలేం జరిగింది? కోణంలో కమిషనర్ మరోసారి పునర్ సమీక్షించాలని పలువురు కోరుతున్నారు.